క్లుప్తంగా

గాయపడిన వారిని పరామర్శించిన న్యాయమూర్తి



బాధితులరాలిని పరామర్శిస్తున్న జడ్జి గురునాథ్

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి తిరుపతిలోని బైరాగి పట్టెడలో టోకెన్ల జారీ కేంద్రం వద్ద జరిగిన తొక్కిసలాట ఉదంతంలో గాయపడిన వారిని గురువారం మధ్యాహ్నం పద్మావతి ఆస్పత్రిలో తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఎం గురునాథ్ పరామర్శించారు. బాధితులకు అందుతున్న వైద్యం, ఇతర విషయాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్జి మీడియాతో మాట్లాడుతూ, బాధితులు అందరికీ తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయపరంగా సహాయ సహకారాలు ఉచితంగా ఇస్తామని తెలిపారు. బాధితుల బంధువులకు న్యాయమూర్తి ధైర్యం చెప్పారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన భక్తులు గాయాల పాలవడం, ఆరుగురు మృతి చెందడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు

విలువలతో ఉత్తములుగా ఎదగాలి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మహతి కళాక్షేత్రంలో గురువారం శ్రీగీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. 'గీతాంజలి' ఎండీ డాక్టర్ మాధవి మాట్లాడుతూ, ఇష్టంగా అభ్యసిస్తే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. 'గీతాంజలి' చైర్మన్ ఎస్.సురేంద్ర, మాజీ సర్పంచ్ గణపతి నాయుడు, ప్రిన్సిపల్ ఎస్వీ.రమణ, నాగరాజు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల పంచాయతీ వైకుంఠపురం నగరిలోని శ్రీశ్రీశ్రీ వైకుంఠపురం లక్ష్మీ ప్రసన్న అభయ హస్తపు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఏడు ద్వారాలలో ప్రవేశించి స్వామి వారిని వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేలా చేశారు. ఉదయం 4 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

70 స్వయం సహాయక సంఘాలకు రుణాలు రూ.10కోట్లు



మాట్లాడుతున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ శోభన్‌బాబు

రామచంద్రాపురం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు శోభన్‌బాబు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మెగా రుణమేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సప్తగిరి గ్రామీణ బ్యాంకు నుంచి 70 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. 10 కోట్ల రుణాలను ఇస్తున్నట్లు తెలిపారు. రుణాలు పొందిన ప్రతి సభ్యురాలు క్రమం తప్పకుండా తిరిగి చెల్లించాలన్నారు. ఈ క్రమంలోనే కమ్మకండ్రిగ పంచాయతీ మిట్టూరుకు నూతనంగా మంజూరైన సిమెంటు రోడ్డుకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇందిరమ్మ, ఏపీఓ గురుమూర్తి, సప్తగిరి గ్రామీణా బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కిషోర్ పట్నాయక్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసులపై బీసీవైపీ అధ్యక్షుడు ఆగ్రహం



ఈస్ట్ సీఐ రామకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రామచంద్ర యాదవ్

తిరుపతి తుడా/చంద్రగిరి/తిరుపతి సిటీ: వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కోసం వచ్చి తొక్కిసలాటతో మరణించిన వారి మృతదేహాలను చూసేందుకు వచ్చిన బీసీవైపీ పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రా యాదవ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రామచంద్ర యాదవ్ సీఐ రామకృష్ణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చురీ వద్ద బందోబస్తు చేసేదానికన్నా, విషాదకర ఘటన చోటు చేసుకోకుండా విధులు నిర్వర్తించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని, మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చే వారిని అడ్డుకోవడం సరికాదంటూ మండిపడ్డారు. పోలీసులు సరైన పనితీరును ప్రదర్శించి ఉంటే ప్రాణ నష్టం వాటిల్లి ఉండేది కాదని ఆయన అన్నారు.

కుటుంబసభ్యుడిని పట్టుకుని రోదిస్తున్న మృతుడు బాబునాయుడు భార్య



మార్చురీ వద్ద రోదిస్తున్న మృతురాలు నిర్మల సోదరి







గాయపడిన మహిళలను రుయా ఆస్పత్రిలోకి తీసుకెళ్తున్న 108 సిబ్బంది

ఈ కన్నీళ్లు తుడిచేదెవరు..?

తొక్కిసలాట మిగిల్చిన అనంతమైన విషాదమిది. ఆ కుటుంబాలు ఏడ్చీ..ఏడ్చీ కళ్లల్లో నీరింకి, చూస్తున్న బాధాతప్త భరిత చూపులు అందరినీ విచలితుల్ని చేశాయి. ఆ కళ్లల్లో ఎన్నో ప్రశ్నలు. ఇక మాకు దిక్కెవ్వరు? మా కుటుంబానికి ధైర్యం, తోడు, ఓదార్పు ఎవరు దేవుడా? అని! ఆపద మొక్కుల వాడివని నీ చెంతకు వస్తే కొండంత దిక్కు లేకుండా పోయింది స్వామీ అని విషణ్ణ వదనాలతో బేలగా చూపులు. ఇదీ రుయా ఆస్పత్రి మార్చురీ వద్ద కనిపించి దృశ్యాలు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కోసం వచ్చి తొక్కిసలాటలో మృతి చెందిన భక్తుల తాలూకు కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మార్చురీ పరిసర ప్రాంతాల్లో మిన్నంటాయి. మరోవైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు సంబంధించిన కుటుంబ సభ్యుల్లోనూ గూడు కట్టుకున్న ఆందోళన. ఆస్పత్రుల్లో వాలిపోయిన అధికార యంత్రాగం. క్షతగాత్రులకు పరామర్శ..వైద్యులతో ఆరోగ్య పరిస్థితిపై వాకబు..గురువారం అంతా ఎటుచూసినా హడావుడి, హైరానా. బైరాగిపట్టెడ రామానాయుడు స్కూల్ వద్ద జరిగిన తొక్కిసలాటలో భక్తులు మరణించినప్పటికీ ఆ తర్వాత కొన్ని గంటల అనంతరం, బుధవారం అర్ధరాత్రి తర్వాత కూడా భక్తులు క్యూలలో టోకెన్ల కోసం వెళ్లడం కనిపించింది. చలిలో కూడా స్వెటర్లు ధరించి, చంటి బిడ్డలను చంకన పెట్టుకుని వెళ్తున్న ఎందరో తల్లులు కూడా కనిపించారు.

– తిరుపతి తుడా / తిరుపతి కల్చరల్ / తిరుపతి ఎడ్యుకేషన్



తొక్కిసలాటలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్





తొక్కిసలాటలో గాయపడ్డ భక్తులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసు, వైద్యులు



స్ట్రెచర్‌పై భక్తుడి మృతదేహం రక్తపు మరకలు



బుధవారం అర్ధరాత్రి అనంతరం విష్ణునివాసం వద్ద టోకెన్ల కోసం క్యూలలో నిరీక్షిస్తున్న భక్తులు

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు







తిరుపతి కల్చరల్: చిన్నారులకు భోగిపండ్లతో ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు, చంద్రగిరి: బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో.., భాకరాపేట: వివిధ వేషధారణలో విద్యార్థులు

తిరుపతి కల్చరల్: వరదరాజనగర్‌లోని భాష్యం పాఠశాలలో గురువారం గంగిరెద్దు, హరిదాసు వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. భోగి మంటలు వేసి పొంగళ్లు పెట్టి సంబరాలు నిర్వహించారు. భోగిపండ్లతో పెద్దలు పిల్లలను ఆశీర్వదించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మహిళావర్సిటీ డాక్టర్ చందీకుమారి విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. భాష్యం పాఠశాల జోన్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్, లిటిల్ ఛాంప్స్ ఇన్‌చార్జ్ సుధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్లూమింగ్ బడ్స్‌లో..

చంద్రగిరి: సంక్రాంతి సంబరాలను మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో నిర్వహించిన సంబరాల్లో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంతో పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో రంగవల్లులు వేశారు, పండుగకు సంబంధించిన చిత్రాలు, పచ్చని తోరణాలు, పూల హారాలతో శోభాయమానంగా అలంకరించారు. చిన్నారులకు పురోహితులు ఆశీర్వదించారు. భోగిమంటల సమక్షంలో తల్లిదండ్రులు భోగిపండ్లతో తమ తమ పిల్లలను దీవించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పిల్లలతో పాటు ఎంఈఓ లలితకుమారి భోగిమంట చుట్టూ తిరుగుతూ గొబ్బెమ్మలు తట్టారు. కరెస్పాండెంట్ బి.హితేంద్రనాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గీతాంజలిలో..

భాకరాపేట : భాకరాపేటలోని గీతాంజలి స్కూల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు, సాంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గిరికుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కూళ్లలో సంక్రాంతి జోష్..



మద్దినాయనపల్లె ఎంపీపీ పాఠశాలలో సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

పాకాల: మండలంలోని మద్దినాయనపల్లె ఎంపీపీ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థి సుశాంత్ హరిదాసు వేషధారణలో అలరించాడు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ నిదర్శనమని పలువురు పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ నవనీత, టీచర్ వనజకుమారి, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

దామలచెరువులో ముగ్గుల పోటీలు



దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

సంక్రాంతి పురస్కరించుకుని మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో పాకాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. 54 మంది విద్యార్థినులు ముగ్గుల్లో తమ ప్రావీణ్యాన్ని చాటారు. పాకాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కెఎన్.తులసీరామన్ సహకారంతో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం.నాగరాజ, లయన్స్‌క్లబ్ సభ్యులు కుప్పుస్వామి నాయుడు, రామయ్య, జీవీ.ప్రసాద్, మస్తాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మ బోధనలో మహాభారతం మేటి



ఈశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

పాకాల: ధర్మాన్ని బోధించడంలో మహాభారతం గొప్ప గ్రంథమని యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఈశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, ప్రాచ్య పరిశోధన సంస్థ, మాడభూషి సాహిత్య కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మహాభారతం-శాస్త్ర విజ్ఞానంపై జాతీయ సదస్సు రెండవ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పాలకులు, తల్లిదండ్రులు, గురువులు, విద్యార్థులు ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వర్తించడమే ధర్మమని ఆయన అన్నారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ, మహాభారతంలో అనేక శాస్త్రాలు ఉన్నాయని, ద్రోణుడు కుంభ సంభవుడుగా జన్మించడం టిష్యూకల్చర్ విధానమన్నారు. అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్ బాషా మాట్లాడుతూ, ఏమి చేయాలి? ఏమి చేయకూడదు.. అనే విషయాలను మహాభారతం నేర్పిస్తుందన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ హరినాయుడు మాట్లాడుతూ, గర్విష్టులు యోగభ్రష్టులవుతారని, ఇలాంటి విషయాలను క్షుణ్ణంగా మహాభారతం వివరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు రెడ్డి, వాసు, ఈశ్వర్‌బాబు, వెంకటకృష్ణయ్య, రమేశ్‌కుమార్, మోహన్ బెహరా, మాసిలామణి, చిట్టికళావతి, మాధవి, రమణమ్మ, భరణీనాథరెడ్డి, శంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకమవడమే 'ట్రెక్కింగ్'



శేషాచల కొండల్లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: సాహసం, పట్టుదలతో ప్రకృతితో మమేకం అవడానికి ట్రెక్కింగ్‌కు మించింది మరొకటి లేదని ప్రముఖ చరిత్రకారులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ అన్నారు. సీనియర్ జర్నలిస్ట్, ట్రెక్కర్ రాఘవశర్మ రచించిన 'శేషాచలం కొండల్లో..' పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం ఎస్వీయూ లైబ్రరీ సెనేట్ హాల్‌లో నిర్వహించారు. ప్రాచ్య పరిశోధనా సంస్థ, జిల్లా పౌరచైతన్య వేదిక, తిరుపతి ట్రెక్కింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వకుళాభరణం ప్రసంగించారు. తన ట్రెక్కింగ్ అనుభవాలను, శేషాచలం కొండల సౌందర్యం, జలపాతాలు, సెలయేళ్లు, తీర్థాలు..ఇలా ఎన్నింటినో పాఠకుల మనస్సును హత్తుకునేలా రాఘవశర్మ అక్షరీకరించడం అభినందనీయమన్నారు. ప్రాచ్య పరిశోధనా సంస్థ విభాగాధిపతి ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు 'శేషాచలం కొండల్లో..' పుస్తకాన్ని సమీక్షిస్తూ, తెలుగులో వచ్చిన యాత్రా సాహిత్యం, ఇతర సాహసికుల యాత్రానుభవాలపై వచ్చిన రచనలను ప్రస్తావించారు. వాటన్నింటికంటే రాఘవశర్మ రచన చాలా భిన్నమైందని విశ్లేషించారు. అతిథిగా హాజరైన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ శేషాచలం కొండల్లో అరుదైన వృక్షాలు, ఔషధ మొక్కలు ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితిలో అడవులు నాశనం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పౌరచైతన్య వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షులు వాకా ప్రసాద్ రాఘవశర్మతో కలిసి తాను చేసిన ట్రెక్కింగ్ అనుభవాలను పంచుకున్నారు. పుస్తక రచయిత మాట్లాడుతూ, తాను 40 ఏళ్ల ప్రాయంలో ట్రెక్కింగ్ మొదలెట్టాలని, ఇప్పుడు 76 ఏళ్ల వయస్సులో కూడా రోజుకు 5 ఇన్సులిన్ ఇంజెక్షన్లు వేసుకుంటూ ట్రెక్కింగ్ చేస్తుండటం వెనుక అడవితో పెనవేసుకున్న బలీయమైన బంధమేనన్నారు. ట్రెక్కింగ్‌కు వెళితే అడవి తల్లి ఒడిలో సేదదీరినట్లు ఉంటుందని, శేషాచల కొండల్లో జలపాతాల సవ్వడి, సెలయేటి ప్రవాహాలు, వీచే గాలిలో కూడా అడవి తల్లి గుండె చప్పుడు వినవచ్చని తన అనుభవాలను హృద్యంగా చెప్పారు. ఆరోగ్యం, పర్యావరణ హితం, సామాజిక బాధ్యతతో ట్రెక్కింగ్ చేసి, వాటిని పుస్తక రూపంలో తెచ్చినట్లు తెలిపారు. పౌరచైతన్య వేదిక జిల్లా కార్యదర్శి పరమేశ్వరరావు, కోశాధికారి హరీష్, సాకం నాగరాజు, ఆచార్య దామోదర నాయుడు, డాక్టర్ ప్రసాద్, ట్రెక్కర్లు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

వారందరికీ మేలు కలిగేలా చూస్తాం

– పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి



సమీక్షిస్తున్న ఏపీ పీసీసీఎఫ్ చిరంజీవిచౌదరి

తిరుపతి మంగళం : ఎర్రచందనం వృక్షాలను పెంచుతున్న రైతులకు, వారి నుంచి ఎర్రచందనం కొనుగోలు చేస్తున్న టింబర్ డిపోల యాజమాన్యాలకు మేలు కలిగేలా చేస్తామని ఏపీ పీసీసీఎఫ్ చిరంజీవిచౌదరి అన్నారు. తిరుపతిలోని బయోట్రిమ్ కార్యాలయంలో గురువారం పీసీసీఎఫ్ నేతృత్వంలో ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఎర్రచందనం చెట్ల పెంపకం రైతులు, ఎర్రచందనం టింబర్ డిపోల అసోసియేషన్ ప్రతినిధుల సమన్వయ సమావేశం నిర్వహించారు. రైతులు, టింబర్ డిపోల యాజమాన్యాలు చేసిన విజ్ఞప్తులను, డిమాండ్లను సాధ్యమైనంతవరకు పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుందని చెప్పారు. కొత్తగా సామిల్లుల ఏర్పాటుకు ప్రస్తుతం అనుమతులు లేవన్నారు. సమావేశంలో ప్రొడక్షన్ విభాగం పీసీసీఎఫ్ పీవీ.చలపతిరావు, సీఎఫ్ సెల్వం, స్టేట్ సిల్వికల్చరిస్ట్ నరేందిరన్, తిరుపతి, కడప, అన్నమయ్య జిల్లాల అటవీ శాఖ పాలనాధికారులు వివేక్, జగన్నాథ్ సింగ్, వినీత్, డీఎఫ్ఓలు శ్రీనివాసులు, రవిశంకర్‌శర్మ, ఎర్రచందనం టింబర్ డిపోల సంఘం అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నాగయ్య, సంయుక్త కార్యదర్శి కొండేటి ఆంజనేయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



వంటల తయారీని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీకృష్ణ

చంద్రగిరి: స్థానిక శ్రీపద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం తయారీ, విద్యార్థులకు వండిన వంటలను డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీకృష్ణ, ఎంఈఓ-2 భాస్కర్ బాబు పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన వంటలను తయారుచేసి వడ్డించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

సంక్రాంతి సంబరాలు

మండలంలోని పనపాకం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ముందస్తు సంక్రాంతి సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తీర్చిదిద్దిన రంగవల్లులను ఎంఈఓ-2 భాస్కర్ బాబు, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి పరిశీలించి విద్యార్థినులను అభినందించారు.